TGTEL/25/A4812

వాయిస్ ఆఫ్ వందే భారత్

Voice of Vande Bharath

తెలుగు దినపత్రిక

సంపుటి : 01| సంచిక : 77 | పేజీలు : 04| వెల: రూ.3/- తెలంగాణ బుధవారం | జులై 01, 2026



# హైదరాబాద్ ట్రాఫిక్ సమస్యలకు 'ఏఐ' చెక్..

- అనలాగ్, మేఘా సంస్థల భారీ ఒప్పందం
- సీఎంతో భేటీ అయిన అలెక్స్ కిప్‌మాన్, మేఘా కృష్ణారెడ్డి
- సెన్సర్లు, రోబోటిక్స్‌తో మారనున్న సిటీ రవాణా వ్యవస్థ..
- వాతావరణ మార్పులపై సీఎం కీలక సూచనలు
- అత్యవసర వాహనాలకు గ్రీన్ ఛానల్..
- 'కాగ్నిటివ్ సిటీ'గా గ్రేటర్ హైదరాబాద్ రూపకల్పన

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మహానగరం హైదరాబాద్‌లో రోజురోజుకూ పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీతో పాటు ఇతర నగర పౌర సమస్యలకు శాశ్వత సాంకేతిక పరిష్కారం చూపేందుకు గ్లోబల్ టెక్నాలజీ సంస్థ 'అనలాగ్', ప్రముఖ ఇన్‌ఫ్రా సంస్థ 'మేఘా ఇంజనీరింగ్ (ఎంఈఐఎల్)' సంయుక్తంగా ముందుకు వచ్చాయి. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి కేంద్రంలోని బోధి పెవిలియన్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డితో అనలాగ్ వ్యవస్థాపకుడు & సీఈఓ అలెక్స్ కిప్‌మాన్, మేఘా సంస్థ ఎండీ పి. కృష్ణారెడ్డి ఉన్నత స్థాయి సమావేశం నిర్వహించారు.ఈ భేటీలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం సీఎం సమక్షంలో ఇరు సంస్థలు తెలంగాణ ప్రభుత్వంతో అవగాహన ఒప్పందం కుదుర్చుకున్నాయి. అనలాగ్, మేఘా సంస్థల సంయుక్త భాగస్వామ్యంలో హైదరాబాద్‌లో చేపట్టబోయే ట్రాఫిక్ పైలట్ ప్రాజెక్టు మరియు భవిష్యత్ సాంకేతిక ప్రణాళికలను సీఎంకు వివరించారు. అత్యవసర రవాణా సేవలుఅంబులెన్స్, అగ్నిమాపక వాహనాలకు అడ్డంకులు లేని మార్గం సుగమం చేయడం. యుటిలిటీ లైన్స్ పర్యవేక్షణభూగర్భ నీటి పైపుల లీకేజీలను ముందుగానే గుర్తించి నివారించడం, విద్యుత్ డిమాండ్‌ను బట్టి సప్లై నిర్వహణ.డేటా ఆధారిత ప్లానింగ్భవిష్యత్ మౌలిక సదుపాయాల ప్రణాళికల కోసం ఖచ్చితమైన డేటా విశ్లేషణ. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇరు సంస్థల ప్రతినిధులకు పలు కీలక సూచనలు చేశారు. హైదరాబాద్ నగరవ్యాప్తంగా ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ అన్నింటినీ ఒకే గొడుగు కిందికి తెస్తూ 'ఇంటిగ్రేట్' చేయాలని ఆదేశించారు."నగరంలో కేవలం సాధారణ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ మాత్రమే కాదు, అకస్మాత్తుగా వచ్చే వాతావరణ మార్పులు, భారీ వర్షాల వంటి అత్యవసర పరిస్థితులకు అనుగుణంగా ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించేలా ఈ టెక్నాలజీని నేరుగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కు అనుసంధానించాలి." అని ఎ.రేవంత్ రెడ్డి సూచించారు. అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్..వేగంగా విస్తరిస్తున్న గ్రేటర్ హైదరాబాద్ అవసరాలకు, పౌరులకు అందించే సేవలను మెరుగుపరచడానికి ప్రభుత్వ కార్యనిర్వహణ సామర్థ్యాన్ని పెంచేలా ఈ సరికొత్త 'కాగ్నిటివ్ సిటీస్' విధానం దోహదపడుతుందని ఇరు సంస్థలు స్పష్టం చేశాయి. ఈ ఆవిష్కరణల ఆధారిత ఒప్పందం ద్వారా హైదరాబాద్ అంతర్జాతీయ స్థాయి డిజిటల్ మౌలిక సదుపాయాల నగరంగా ఎదగడానికి మైలురాయిగా మారుతుందని పారిశ్రామిక వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.

# ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి..

- రేవంత్‌కు కేటీఆర్ ఘాటు సవాల్!
- పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటా
- చర్చకు మేం సిద్ధం..
- వేదిక, సమయం మీరే చెప్పండి
- 'దండుపాళ్యం' ముఠాలా కాంగ్రెస్ నేతల దోపిడీ
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



2లో..

## రేపు తెలంగాణ కేబినేట్ భేటీ

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** తెలంగాణ రాష్ట్ర మంత్రిమండలి సమావేశం జూలై 2వ తేదీన గురువారం మధ్యాహ్నం 3:00 గంటలకు జరగనుంది. హైదరాబాద్‌లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని 6వ అంతస్తులో ఉన్న కేబినెట్ సమావేశ మందిరంలో ఈ 34వ మంత్రిమండలి సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఈ కేబినెట్ సమావేశం జరిగే సమయంలో అధికారులందరూ తప్పనిసరిగా హెడ్‌క్వార్టర్స్‌లో అందుబాటులో ఉండాలని సిఎస్ తన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఇకపోతే వివిధ అంశాలపై ఈ కేబినేట్‌లో చర్చించనున్నారు. ఇటీవలే కేంద్రం మూసీ ప్రక్షాళనకు ఆమోదం తెలిపింది. అలాగే మెట్రోకు కూడా పచ్చ జెండా ఊపింది. ఈ క్రమంలో ఎ లా ముందుకు వెళ్లాలన్నదానిపై చర్చించే అవకాశం ఉంది.

## వైఫల్యాలపై దృష్టి మరల్చేందుకే రేవంత్ 'రైతు డ్రామాలు'



2లో..

- హరీష్ రావు తీవ్ర ధ్వజం
- బడ్జెట్ రూ.82 వేల కోట్లు అయితే..
- లక్షా 75 కోట్లు ఎలా ఖర్చు చేశారు?
- సీఎం, డిప్యూటీ సీఎంలవి కల్పిత లెక్కలు
- అసెంబ్లీ అయినా, ఏ వేదికైనా కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చకు మేం సిద్ధం
- మాజీ మంత్రి హరీష్ రావు సవాల్

## ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులది కీలకపాత్ర



2లో..

- డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర
- రెండున్నర ఏళ్లలో వైద్య శాఖలో 15 వేల పోస్టుల భర్తీ..
- జూడాల స్టైఫండ్ 15 శాతం పెంపు
- ఉస్మానియా నూతన భవనం, సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చారిత్రాత్మకం

వాయిస్ ఆఫ్ Voice of Vande Bharath
వందే భారత్
VOICE OF
VANDE BHARATH
బుధవారం, జులై 01, 2026

# నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలి

- హైదరాబాద్ డీహెచ్ఎంఓ డా.పుట్ల శ్రీనివాస్
- బేగంపేట కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్‌లో ఘనంగా 'డాక్టర్స్ డే'
- ఉత్తమ సేవలు అందించిన వైద్యులకు సత్కారం

**హైదరాబాద్ సిటీ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "వైద్య వృత్తి ఎంతో పవిత్రమైనది. డాక్టర్లు అన్నివేళలా అందుబాటులో ఉంటూ, అంకితభావంతో నిస్వార్థంగా పేద ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలి" అని హైదరాబాద్ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ పిలుపునిచ్చారు. జాతీయ వైద్యుల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం బేగంపేటలోని కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ ఆడిటోరియంలో జిల్లా వైద్య & ఆరోగ్య శాఖ తరపున ప్రత్యేక వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. వైద్యులు అనుసరించాల్సిన నిబద్ధతను వివరిస్తూ డీహెచ్ఎంఓ పలు కీలక సూచనలు చేశారు. వైద్యులు ఖచ్చితమైన సమయపాలన పాటిస్తూ, ఆసుపత్రికి వచ్చే రోగులను స్వయంగా పరీక్షించాలన్నారు. వారి వ్యాధి తీవ్రతను, చికిత్సా విధానాన్ని కూలంకషంగా రోగితో చర్చించి, వారిలో






కొండంత మనోధైర్యాన్ని నింపాలని సూచించారు. అత్యవసర ఆరోగ్య సేవలు అవసరమైన రోగుల విషయంలో ఏమాత్రం ఆలస్యం చేయకుండా వైద్యులు తక్షణమే స్పందించి ప్రాణాలు కాపాడాలన్నారు. హైదరాబాద్‌లోని మారుమూల మురికివాడలు, బస్తీల్లో నివసిస్తున్న నిరుపేద ప్రజల కోసం ప్రైవేట్ హాస్పిటళ్ల భాగస్వామ్యంతో త్వరలోనే విస్తృతంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేయనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఆసుపత్రులకు వచ్చే రోగులకు ప్రశాంతమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని కల్పించడం ద్వారానే సగం అనారోగ్య ఇబ్బందుల నుండి వారికి ఉపశమనం లభిస్తుందని గుర్తుచేశారు. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ వైద్య రంగంలో అత్యుత్తమ సేవలు కనబరిచిన పలువురు ప్రోగ్రామ్ ఆఫీసర్స్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్స్ మెడికల్ ఆఫీసర్స్ లను జాతీయ వైద్యుల దినోత్సవ వేదికపై శాలువాలు, జ్ఞాపికలతో డాక్టర్ పుట్ల శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. ఈ రజతోత్సవ సదృశ్య కార్యక్రమంలో కిమ్స్ సన్‌షైన్ హాస్పిటల్ సీఈవో డాక్టర్ సుధాకర్ యాదవ్, ప్రముఖ సీనియర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ శ్రీధర్ కస్తూరి, జిల్లా క్షయ నివారణ అధికారి డాక్టర్ చల్లా దేవి, జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ అనిత, వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ శ్రీధర్, సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సాయిబాబాతో పాటు పలువురు ప్రోగ్రామ్ ఆఫీసర్లు, నగర వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఇజ్జత్ పోయేదానికి ఢిల్లీకి ఎందుకు వెళ్లాలి..

- రేవంత్‌కు కేటీఆర్ ఘాటు సవాల్!
- పాలనా వైఫల్యాలను ఎండగట్టకపోతే శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పకుంటా
- చర్చకు మేం సిద్ధం.. వేదిక, సమయం మీరే చెప్పండి

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రజలు ఇచ్చిన ఐదేళ్ల అవకాశంలో ఇప్పటికే 50 శాతం సమయం పూర్తయింది. కానీ, ఇప్పటివరకు రాష్ట్రానికి ఏం చేశారో చెప్పుకోలేని దయనీయ స్థితిలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఉన్నారు" అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. అప్పుల కారణంగా ఢిల్లీకి వెళితే తెలంగాణ ఇజ్జత్ పోతోందని చెబుతున్న సీఎం, మరి ఈ రెండున్నరేళ్లలో 72 సార్లు ఢిల్లీకి ఎందుకు తిరిగారో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రేవంత్ రెడ్డి విసిరిన సవాల్‌ను స్వీకరిస్తూ కేటీఆర్ సంచలన కౌంటర్ ఇచ్చారు. బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో తెలంగాణ సాధించిన అద్భుత ప్రగతిని కేటీఆర్ గణాంకాలతో సహా మీడియా ముందుంచారు. సాగు విస్తీర్ణం పెంపు: 2014-15 నాటికి రాష్ట్రంలో ధాన్యం సాగు విస్తీర్ణం కేవలం 26 లక్షల హెక్టార్లు ఉంటే, కేసీఆర్ అధికారం నుంచి దిగిపోయే నాటికి అది ఏకంగా 59 లక్షల హెక్టార్లకు చేరిందని స్పష్టం చేశారు. కేసీఆర్ ప్రభుత్వం దిగిపోయే నాటికి రాష్ట్ర అప్పు రూ.3.50 లక్షల కోట్లు మాత్రమేనని, సీఎం రేవంత్ రెడ్డి కావాలనే కాకి లెక్కలతో అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. కాళేశ్వరం ప్రాజెక్టును చూసి ప్రపంచమంతా ఆశ్చర్యపోయిందని గుర్తుచేశారు. హైదరాబాద్ ప్రగతిని చూసి తమిళ సూపర్ స్టార్ రజనీకాంత్ 'న్యూయార్క్‌లా ఉందన్నారని', ఇటీవల వచ్చిన మేఘాలయ సీఎం కాన్రాడ్ సంగ్మా కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను చూసి అభినందించారని తెలిపారు. గతంలో ఫాక్స్‌కాన్ ఛైర్మన్ సైతం హైదరాబాద్‌ను ప్రశంసించారని పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో అవినీతి పరాకాష్టకు చేరిందని కేటీఆర్ ఆరోపించారు. సీఎం మరియు ఆయన కుటుంబ సభ్యుల దోపిడీతో రాష్ట్ర ఆస్తులు కరిగిపోతున్నాయన్నారు. "రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలు దండుపాళ్యం ముఠాలా దోచుకుంటున్నారు. రాహుల్ బంధువులకు, పొంగులేటి బంధువులకు, సొంత సోదరులకు కట్టబెడుతున్న కాంట్రాక్టుల బంద్ నడవాలి" అని హెచ్చరించారు. ప్రజాధనంతో రూ.200 కోట్లు పెట్టి సరికొత్తగా మరో క్యాంపు కార్యాలయాన్ని నిర్మించారని, కేవలం దాని కాంపౌండ్ వాల్ నిర్మాణానికే రూ.19 కోట్లు తగలేశారని ఆరోపించారు. బీఆర్ఎస్, కాంగ్రెస్ పాలనపై సీఎం రేవంత్ రెడ్డి చేసిన సవాల్‌ను తాను పూర్తిగా స్వీకరిస్తున్నట్లు కేటీఆర్ ప్రకటించారు. చర్చకు వేదిక ఎక్కడైనా తాను సిద్ధమంటూ కొన్ని ఆప్షన్లను విసిరారు. అసెంబ్లీనా? ప్రెస్ క్లబ్ నా? లేక జూబ్లీహిల్స్ ప్యాలెసా? ఎక్కడికైనా రావడానికి నేను సిద్ధం. కాంగ్రెస్ పార్టీ 'రైతు డిక్లరేషన్' ప్రకటించిన వరంగల్ చౌరస్తానా? లేదా 2 లక్షల ఉద్యోగాలంటూ రాహుల్ గాంధీ డైలాగులు కొట్టిన అశోక్‌నగర్ చౌరస్తానా? మీరు వస్తారో.. మీ బాస్ రాహుల్ గాంధీని తెచ్చుకుంటారో రండి. "మేము చర్చకు సిద్ధంగా ఉన్నాం. తేదీ, సమయం మీరే ఫిక్స్ చేయండి. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనా వైఫల్యాలను, తప్పులను గణాంకాలతో సహా ఎండగట్టకపోతే నేను శాశ్వతంగా రాజకీయాల నుంచి తప్పుకుంటాను" అని రేవంత్‌కు కేటీఆర్ భీషణ ప్రతిజ్ఞ చేశారు. ఈ ప్రెస్ మీట్‌లో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, బీఆర్ఎస్ నేతలు పాల్గొని కేటీఆర్ సవాల్‌కు మద్దతు పలికారు.

# వైఫల్యాలపై దృష్టి మరల్చేందుకే రేవంత్ 'రైతు డ్రామాలు'

- హరీష్ రావు తీవ్ర ధ్వజం
- బడ్జెట్ రూ.82 వేల కోట్లు అయితే..
- లక్షా 75 కోట్లు ఎలా ఖర్చు చేశారు?
- సీఎం, డిప్యూటీ సీఎంలవి కల్పిత లెక్కలు
- ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ అన్న హామీ ఏమైంది?
- అసెంబ్లీ అయినా, ఏ వేదికైనా కాంగ్రెస్ వైఫల్యాలపై చర్చకు మేం సిద్ధం
- మాజీ మంత్రి హరీష్ రావు సవాల్

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్** :శిల్పకళావేదిక సాక్షిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క చేసిన వ్యాఖ్యలపై బీఆరఎస్ అగ్రనేత, మాజీ మంత్రి తన్నీరు హరీష్ రావు తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీల అమలులో పూర్తిగా విఫలమైందని, ఆ వైఫల్యాల నుండి ప్రజల దృష్టి మరల్చేందుకే రేవంత్ రెడ్డి రైతుల పేరుతో కొత్త డ్రామాలకు తెరతీశారని మండిపడ్డారు. రైతు భరోసా పేరుతో కేవలం పబ్లిసిటీ స్టంట్లు చేస్తూ, అన్నదాతల అసలు సమస్యలను పక్కన పెట్టేసి గొప్పలు చెప్పుకోవడం తప్ప ఈ ప్రభుత్వం చేసింది ఏమీ లేదని ధ్వజమెత్తారు. రేవంత్ రెడ్డి మాట్లాడేవన్నీ చేతగాని మాటలు, చెత్త వాగుడు తప్ప వాటి వల్ల రైతులకు కొత్తగా ఒరిగిందేమీ లేదన్నారు. ప్రభుత్వం చెబుతున్న లెక్కల్లోని డొల్లతనాన్ని హరీష్ రావు ఆధారాలతో సహా ఎండగట్టారు. ఒకే సభలో ఉంటూ ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్క రైతుల కోసం రూ.1.56 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబితే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం రూ.1.75 లక్షల కోట్లు ఖర్చు చేశామని చెబుతున్నారని, అసలు వీరిద్దరిలో ఎవరి లెక్కలు నిజమని ప్రశ్నించారు. క్షేత్రస్థాయిలో చేసింది ఏమీ లేదు కాబట్టే ఇద్దరూ ఇష్టం వచ్చినట్లు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. 2027 మార్చి 31 వరకు వ్యవసాయ రంగానికి చేసిన మొత్తం బ్జడెట్ కేటాయింపులే సుమారు రూ.82 వేల కోట్లు అయితే, జూన్ 2026 నాటికే లక్షా 56 వేల కోట్లు, లక్షా 75 వేల కోట్లు ఎలా ఖర్చు చేశారో సమాధానం చెప్పాలని నిలదీశారు. బ్జడెట్‌లో లేని డబ్బును ఖర్చు చేశారా? లేక రైతులను మభ్యపెట్టడానికి కల్పిత లెక్కలు చెబుతున్నారా? అని హరీష్ రావు ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్ధాలను పదిసార్లు చెప్పినా అవి నిజాలు కావని, లేనివి ఉన్నట్లు చెప్తే రైతులు నమ్మరని హితవు పలికారు. ఎన్నికల సమయంలో ఎలాంటి షరతులు లేకుండా రెండు లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పి ఓట్లు అడిగారని, తీరా అధికారంలోకి వచ్చాక ఇప్పుడు కేవలం స్వల్పకాలిక రుణాలకే మాఫీ వర్తిస్తుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పడం రైతులను దారుణంగా మోసం చేయడం కాదా అని హరీష్ రావు ప్రశ్నించారు. ఇదే ముందే చెప్పి ఉంటే రైతులు కాంగ్రెస్‌ను నమ్మేవారా అని అడిగారు. మేనిఫెస్టోలో ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట చెప్పడం కాంగ్రెస్ మోసపూరిత వైఖరికి నిలువెత్తు నిదర్శనమన్నారు. ఫేక్ ప్రచారాలు చేసుకోవడం ఆపి, రైతులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేనిపక్షంలో రైతులే కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. రేవంత్ రెడ్డి రైతులకు ఇచ్చిన హామీలను ఎలా గాలికి వదిలేశారో, అన్నదాతను ఎలా మోసం చేశారో నిరూపించడానికి తాము సిద్ధంగా ఉన్నామని.. దీనిపై చర్చించేందుకు కేవలం అసెంబ్లీ మాత్రమే కాదు, ఏ వేదికపైనైనా తాము సిద్ధమని హరీష్ రావు సవాల్ విసిరారు.

# ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులది కీలకపాత్ర

- డాక్టర్స్ డే శుభాకాంక్షలు తెలిపిన మంత్రి దామోదర
- రెండున్నర ఏళ్లలో వైద్య శాఖలో 15 వేల పోస్టుల భర్తీ..
- జూడాల స్టైఫండ్ 15 శాతం పెంపు
- ఉస్మానియా నూతన భవనం, సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చారిత్రాత్మకం

**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** డాక్టర్స్ డే సందర్భంగా వైద్యులందరికీ ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శుభాకాంక్షలు తెలిపారు. తమ నైపుణ్యం ద్వారా ప్రతి రోజూ వేల ప్రాణాలను డాక్టర్లు కాపాడుతున్నారని మంత్రి పేర్కొన్నారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ప్రభుత్వ వైద్యులు కీలక పాత్ర పోషిస్తున్నారన్నారు. ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్నారని, వారి సేవలు ఆరోగ్య వ్యవస్థకు ఎంతో కీలకమని అన్నారు. రాష్ట్రంలో ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో వైద్యులకు అవసరమైన మౌలిక సదుపాయాలు, ఆధునిక వైద్య సౌకర్యాలు, తగిన మానవ వనరులు కల్పించేందుకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందని తెలిపారు. ఈ రెండున్నర సంవత్సరాల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో 440 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులు, 1,616 స్పెషలిస్ట్ డాక్టర్ పోస్టులు, సుమారు 800 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులను భర్తీ చేసినట్లు మంత్రి గుర్తు చేశారు. డాక్టర్లతో పాటు ఇతర పోస్టులను కూడా పెద్ద సంఖ్యలో భర్తీ చేశామని చెప్పారు. సుమారు 15 వేల పోస్టులు భర్తీ చేశామని తెలిపారు. ఉద్యోగాల కోసం ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న డెంటిస్టుల ఆకాంక్షను నెరవేర్చుతూ 48 డెంటల్ సర్జన్ పోస్టులను భర్తీ చేశామని మంత్రి గుర్తు చేశారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో సుమారు 1,300 మంది డాక్టర్లకు పదోన్నతులు కల్పించినట్లు ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. డాక్టర్ల దశాబ్దకాల ఆకాంక్ష అయిన ఉస్మానియా నయా హాస్పిటల్ నిర్మాణాన్ని ప్రారంభించామని, అలాగే గాంధీ, ఉస్మానియా మెడికల్ కాలేజీల్లో నూతన హాస్టళ్ల నిర్మాణం పూర్తికావొచ్చిందని మంత్రి తెలిపారు. వైద్యులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సెకండరీ హెల్త్ కేర్ డైరెక్టరేట్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో డాక్టర్లు, ఇతర సిబ్బందికి మెరుగైన వర్క్ ఎన్విరాన్‌మెంట్ కల్పించేందుకు చర్యలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. జూనియర్ డాక్టర్ల స్టైఫండ్, సీనియర్ రెసిడెంట్ల గౌరవ వేతనాలను 15 శాతం మేర పెంచామని మంత్రి గుర్తు చేశారు. అద్దె భవనాలు, పాత భవనాల్లో కొనసాగుతున్న మెడికల్ కాలేజీలు, హాస్పిటళ్లకు అత్యాధునిక సౌకర్యాలతో కూడిన ఆధునిక భవనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నామని స్పష్టం చేశారు. భవిష్యత్తులోనూ వైద్యుల సంక్షేమం, వృత్తిపరమైన అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజలకు మరింత నాణ్యమైన వైద్య సేవలు అందించే దిశగా వైద్యులు తమ సేవలను కొనసాగించాలని కోరుతూ, డాక్టర్స్ డే సందర్భంగా మరోసారి వైద్యులందరికీ మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

వాయిస్ ఆఫ్ వందే భారత్ Voice of Vande Bharath

VOICE OF VANDE BHARATH

బుధవారం, జులై 01, 2026

# ‘ఎస్ఐఆర్’ను సద్వినియోగం చేసుకోవాలి

- ఓటు హక్కు పట్ల ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలి
- అచ్చంపేట ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ
- మారుతీ నగర్ కాలనీలో పర్యటన..
- ఓటర్ మ్యాపింగ్‌పై ప్రజలకు అవగాహన



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటరు జాబితా సవరణ——స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియను నియోజకవర్గ ప్రజలందరూ సద్వినియోగం చేసుకోవాలని అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ పిలుపునిచ్చారు. బుధవారం అచ్చంపేట పట్టణంలోని 20వ వార్డు పరిధిలో గల మారుతీ నగర్ కాలనీలో ఆయన విస్తృతంగా పర్యటించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్తూ ఓటరు జాబితా సవరణ, మ్యాపింగ్ ప్రక్రియపై ప్రజలకు స్వయంగా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ మాట్లాడుతూ.. గతంలో 2002లో జరిగిన ఓటర్ల జాబితాతో ప్రస్తుతం ఉన్న ఓటర్ల వివరాలను అనుసంధానం చేసి, జాబితాలోని తప్పులను పూర్తిగా సరిదిద్దడమే ఈ ఎస్ఐఆర్ ఓటర్ మ్యాపింగ్ ముఖ్య ఉద్దేశమని వివరించారు. ప్రస్తుతం మీ ఇంటికి వచ్చే బూత్ లెవెల్ అధికారులు ఇచ్చే ‘ఇన్యుమరేషన్ ఫామ్’లో పేరు, ఇంటి నంబర్, ప్రస్తుత ఓటర్ ఐడీ కార్డు నంబర్, ఆధార్ నంబర్‌లను ఎటువంటి తప్పులు లేకుండా స్పష్టంగా రాయాలని సూచించారు. 2002 నాటి ఓటర్ లిస్ట్ మ్యాపింగ్ కోసం మీ పాత వివరాలను గానీ, లేదా మీరు కొత్తవారైతే మీ తల్లిదండ్రులు, అమ్మమ్మ, నానమ్మల నాటి పాత ఓటర్ వివరాలను అందులో నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ మీరు నివాసం ఉంటున్న కాలనీ మారినా లేదా మీ ఓటర్ వివరాల్లో మార్పులు, చేర్పులు చేయాలన్నా ఈ ఫామ్‌తో పాటు ఫామ్ 8 ను ఉపయోగించవచ్చని తెలిపారు. మీ ఇంట్లో 18 సంవత్సరాలు నిండిన యువతీ యువకులు ఉంటే, వారి కొత్త ఓటు హక్కు నమోదు కోసం ఫామ్ 6ను కూడా దీనితో పాటే పూర్తి చేసి బీఎల్ఓకు అందించి, వారు ఇచ్చే రశీదును భద్రంగా ఉంచుకోవాలని కోరారు. కాలనీ పర్యటనలో భాగంగా స్థానిక ప్రజలు పలు సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. కాలనీలో నెలకొన్న డ్రైనేజీ, తాగునీరు, అంతర్గత రోడ్ల సమస్యలను తెలుసుకున్న ఆయన.. ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు కలగకుండా తక్షణమే తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత మున్సిపల్, వార్డు అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు, కాలనీవాసులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలి

- పనుల్లో నాణ్యత లోపిస్తే సహించేది లేదు
- హౌసింగ్ పీడీ గోపాల్



**అచ్చంపేట,వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా, త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా హౌసింగ్ ప్రాజెక్ట్ డైరెక్టర్ గోపాల్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన బల్మూరు మండలంలోని కొండనాగుల గ్రామంలో నిర్మాణ దశలో ఉన్న ఇందిరమ్మ ఇండ్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇండ్ల పురోగతిని, పునాదుల నాణ్యతను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పీడీ గోపాల్ మాట్లాడుతూ.. పేదలకు నిర్మించి ఇచ్చే ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణంలో ఎలాంటి నాణ్యతా లోపాలు ఉండకూడదని స్పష్టం చేశారు. లబ్ధిదారులకు ఇబ్బంది కలగకుండా పనులు వేగంగా ముందుకు సాగేలా క్షేత్రస్థాయి అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఇండ్ల పరిశీలన అనంతరం బల్మూరు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ ఏఈలతో పీడీ గోపాల్ ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. గ్రామాల వారీగా ఇండ్ల నిర్మాణ ప్రగతిని అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులను సమన్వయం చేసుకుంటూ, త్వరలోనే ఇండ్ల నిర్మాణాన్ని పూర్తి చేసేలా పంచాయతీ కార్యదర్శులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఈ సందర్భంగా ఆదేశించారు. “ఇందిరమ్మ ఇండ్ల పనులు వేగవంతం చేయడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం. సాంకేతిక సమస్యలను అధిగమిస్తూ పనులను త్వరగా పూర్తి చేసి పేదలకు ఇండ్లను అందుబాటులోకి తేవాలి.” అని గోపాల్ అన్నారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన, సమీక్షా కార్యక్రమంలో బల్మూరు ఎంపీడీవో తుమ్మల రేవతి రెడ్డి, హౌసింగ్ డీఈ హరి నాయక్, ఏఈ నరసింహ, మండలంలోని పంచాయతీ కార్యదర్శులు, హౌసింగ్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

# ‘ఉమామహేశ్వరం’లో రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ప్రత్యేక పూజలు

- పూర్ణకుంభంతో స్వాగతం పలికిన ఆలయ అర్చకులు
- నిత్య అన్నదాన వితరణపై ఈసీ రాణి కుముదిని ప్రశంసలు



**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** శ్రీశైలం మహా పుణ్యక్షేత్రానికి ఉత్తర ద్వారంగా విరాజిల్లుతున్న అచ్చంపేట మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం శ్రీ ఉమామహేశ్వర స్వామి దేవస్థానాన్ని తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని బుధవారం సందర్శించారు. ఆలయ ప్రాంగణానికి చేరుకున్న ఆమెకు ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఆలయంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా గణపతి పూజ, ఉమాదేవి పూజ, కుంకుమార్చన, అభిషేక కార్యక్రమాల్లో ఆమె సాంప్రదాయబద్ధంగా పాల్గొన్నారు. అనంతరం ఆలయ వేద పండితులు ఆమెకు శేష వస్త్రం కప్పి, స్వామివారి తీర్థప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం గావించారు. పూజా కార్యక్రమాల అనంతరం ఆమె క్షేత్రంలో భక్తుల కోసం ఏర్పాటు చేసిన మౌలిక వసతులను, అందుతున్న సేవలను పరిశీలించారు. ఆలయ పాలక మండలి చైర్మన్ భీరం మాధవరెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అందిస్తున్న సేవలను ఆమె ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా కొండపైకి వచ్చే భక్తులకు, పేదలకు నిరంతరాయంగా నిత్య అన్నదాన సౌకర్యం కల్పించడం పట్ల ఆమె హర్షం వ్యక్తం చేశారు.

“ఉత్తర ద్వార క్షేత్రమైన ఉమామహేశ్వరంలో ఆధ్యాత్మిక వాతావరణం ఎంతో ప్రశాంతతను ఇచ్చింది. కొండపైకి వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ వారు అందిస్తున్న సేవలు, నిత్య అన్నదాన వితరణ ఎంతో అభినందనీయం.” అని రాణి కుముదిని ఆనందం వ్యక్తం చేశారు. ఈ పర్యటన కార్యక్రమంలో అచ్చంపేట ఆర్డీఓ యాదగిరి, తహసీల్దార్ సైదులు, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, సీఐ నాగరాజు, ఉప తహశీల్దార్ బీశ్వ, ఆర్ఐ శివ, ఆలయ పాలక మండలి సభ్యులు పవన్ కుమార్, ఆలయ సిబ్బంది, పోలీస్ బందోబస్తు అధికారులు పాల్గొన్నారు.

# దాతల సహకారంతో నిరంతర అన్నదానం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రం, దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయ పరిసరాల్లో ‘అన్నదాత సుఖీభవ’ నినాదంతో అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వహిస్తున్న నిత్య అన్నదాన కార్యక్రమం బుధవారంతో విజయవంతంగా 738వ రోజుకు చేరుకుంది. సంస్థ ప్రతినిధి అరవింద్ రెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఆయన మిత్రుడు తిరుపతి అందించిన ఆర్థిక సాయంతో ఈరోజు ప్రత్యేక అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఆలయ ఆవరణతో పాటు పట్టణంలోని పలు పరిసర ప్రాంతాలలో ఉన్న అన్నార్తులకు, యాచకులకు నిర్వాహకులు స్వయంగా భోజన ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అన్నపూర్ణ స్వచ్ఛంద సేవా సంస్థ నిర్వాహకురాలు తోట లహరి మాట్లాడుతూ.. సుదీర్ఘకాలంగా ఈ అన్నదాన కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగడానికి దాతల ఉదారత్వమే కారణమన్నారు. సంస్థకు నిరంతరం అండగా నిలుస్తున్న శాశ్వత దాతలు నాగుబోతు రవీందర్ – జ్యోతి దంపతులు (భాను ఏజెన్సీస్) భగవత్ స్వరూపులని కొనియాడారు. ఈరోజు కార్యక్రమానికి తోట లక్ష్మి, కూరగాయల విభాగం దాతలు మధు – మమత దంపతులు అందించిన ప్రత్యేక సహకారం ఎంతో అభినందనీయమన్నారు. “ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడమే అన్ని దానాల కన్నా మిన్న అయింది. ట్రస్ట్ తరపున సాగుతున్న ఈ పవిత్ర సేవా కార్యక్రమాలకు ప్రజలు, భక్తులు తమ వంతు సహాయ సహకారాలు అందించాలి.” అని సంస్థ నిర్వాహకురాలు తోట లహరి కోరారు. రాజరాజేశ్వర స్వామి సాక్షిగా సాగుతున్న ఈ అన్నదానంలో భాగస్వాములు కావాలనుకునే వారు, తమ పుట్టినరోజులు లేదా శుభకార్యాల సందర్భంగా అన్నదానం చేయాలనుకునే వారు ట్రస్ట్ అధికారిక నంబర్ 8919376459 ను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు రాజేష్, స్వచ్ఛంద సేవకులు, స్థానికులు పాల్గొన్నారు.

# బస్సులను సమయపాలనతో నడపాలి

## అచ్చంపేట డిపో మేనేజర్‌కు వినతిపత్రం




**అచ్చంపేట, వాయిస్ ఆఫ్ వందే భారత్:** గ్రామీణ ప్రాంతాల నుండి పట్టణాలకు వచ్చే విద్యార్థులు సకాలంలో పాఠశాలలు, కళాశాలలకు చేరుకునేలా ఆర్టీసీ బస్సులను ఖచ్చితమైన సమయపాలనతో నడపాలని యునైటెడ్ స్టూడెంట్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా డిమాండ్ చేసింది. బుధవారం అచ్చంపేట ఆర్టీసీ డిపో మేనేజర్ ని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎండి సయ్యద్ నేతృత్వంలో విద్యార్థి సంఘాల ప్రతినిధులు మర్యాదపూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎండి సయ్యద్ మాట్లాడుతూ.. అచ్చంపేట పరిసర ప్రాంతాల్లోని పలు గ్రామాలకు ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు సక్రమంగా రాకపోవడం వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బస్సులు సమయానికి రాకపోవడం వల్ల విద్యార్థులు క్లాసులకు ఆలస్యంగా వెళ్లాల్సి వస్తోందని, దీనివల్ల వారు చదువులో వెనుకబడిపోతున్నారని పేర్కొన్నారు. అచ్చంపేట డివిజన్ పరిధిలోని ప్రతి పల్లెకూ విద్యార్థుల సమయాలకు అనుగుణంగా బస్సు సర్వీసులు నడిపించేలా డిపో మేనేజర్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని కోరారు. “ఆర్టీసీ యాజమాన్యం తక్షణమే స్పందించి రూట్లను సమీక్షించాలి. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, గ్రామీణ ప్రాంతాలకు సమయపాలనతో కూడిన బస్సులను నడపాలి. లేనిపక్షంలో విద్యార్థులను సమీకరించి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతాం.” అని యూఎస్ఎఫ్ఐ రాష్ట్ర నాయకులు ఎండి సయ్యద్ హెచ్చరించారు. ఈ వినతిపత్రం సమర్పించిన అనంతరం డిపో మేనేజర్ సానుకూలంగా స్పందిస్తూ, విద్యార్థుల సమస్యలను పరిష్కరించి, బస్సుల సమయపాలనను పర్యవేక్షిస్తామని హామీ ఇచ్చారు. యూఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకులు రాజు, అంజి, గణేష్, రవి పాల్గొన్నారు.

# ఎన్యూమరేషన్ ఫారాల్లో వివరాలు పక్కాగా నింపాలి



**సిరిసిల్ల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎన్యూమరేషన్ ఫారాలలో ఓటర్ల వివరాలను ఎటువంటి తప్పులు లేకుండా అత్యంత పక్కాగా నింపాలని రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ అధికారులను ఆదేశించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో భాగంగా ఓటర్ల నుండి ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ కార్యక్రమాన్ని బుధవారం సిరిసిల్ల పట్టణంలోని 33వ వార్డులో గల బూత్ నంబర్ 163, 164, 166 కేంద్రాల పరిధిలో నిర్వహించారు. ఈ కేంద్రాలను జిల్లా కలెక్టర్ స్వయంగా సందర్శించి, క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. ఓటరు నమోదు, సవరణల ప్రక్రియ అత్యంత పారదర్శకంగా జరగాలన్నారు. బూత్ లెవల్ అధికారులు ఓటర్లకు ఇప్పటికే పంపిణీ చేసిన ఫారాలతో పాటు, వారి నుండి ప్రస్తుత లేటెస్ట్ పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలను తప్పనిసరిగా సేకరించాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సహాయాన్ని బీఎల్ఓలు ఎప్పటికప్పుడు అందించాలని, ఫారంలోని ప్రతి కాలమ్‌ను నిశితంగా పరిశీలించి వివరాలు నమోదు చేయాలన్నారు. సేకరించిన అన్ని వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ వ్యవస్థలో పక్కాగా నమోదు చేయాలని స్పష్టం చేశారు. ఏమాత్రం నిర్లక్ష్యం వహించినా చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలన కార్యక్రమంలో ఆర్డీఓ శ్రీధర్ బాబు, తహసీల్దార్ మహేష్ కుమార్, మున్సిపల్ కమిషనర్ ఖదీర్ పాషా, విభాగాధిపతులు, రెవెన్యూ అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# శ్రీరాముడిపై రాహుల్ గాంధీది భక్తి.. మోడీది ఓట్ల రాజకీయం!

- అయోధ్య రామాలయంలో దొంగతనంపై మోడీ, అమిత్ షా ఎందుకు నోరు విప్పడం లేదు?
- దేవుడి పేరుతో పబ్లిసిటీ..
- భద్రత కల్పించడంలో కేంద్ర, యూపీ ప్రభుత్వాల వైఫల్యం
- టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్ర ధ్వజం






**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్:** "సాక్షాత్తు అయోధ్య రాముడి గుడిలోనే దొంగతనం జరిగితే ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనీసం నోరు విప్పకపోవడం సిగ్గుచేటు. బీజేపీకి శ్రీరాముడు కేవలం ఓటు బ్యాంక్, రాజకీయాలకే పరిమితమా?" అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. బుధవారం హైదరాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన కేంద్ర, ఉత్తరప్రదేశ్ ప్రభుత్వాల తీరుపై మండిపడ్డారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో, ప్రేమతో అయోధ్య రామయ్య హుండీలో కానుకలు వేస్తుంటే, అక్కడ దొంగతనం జరగడం భక్తుల నమ్మకాన్ని వమ్ము చేయడమేనన్నారు. అయోధ్యలో అపచారం జరిగితే మోడీ, అమిత్ షా స్పందించలేదు కానీ, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తక్షణమే స్పందించి పార్లమెంట్ సభ్యులతో కమిటీ వేసి అయోధ్యకు పంపించారని గుర్తుచేశారు. గత 40 ఏళ్లుగా బీజేపీ రాముడి పేరుతో రాజకీయం చేస్తూ కేంద్రంలో అధికారంలోకి వచ్చిందని, కేవలం గుడి కట్టడమే కాదు.. దాన్ని సక్రమంగా చూసుకోవడం, భద్రత కల్పించడం కూడా ప్రభుత్వ బాధ్యత కాదా అని ప్రశ్నించారు. దొంగతనం జరిగితే విచారణ జరిపి నిందితులను పట్టుకోవాల్సింది పోయి, ట్రస్ట్ సభ్యులతో రాజీనామాలు చేయించి చేతులు దులుపుకుంటారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. "మోడీ దేవుడికి పూజలు చేసి పబ్లిసిటీ కోరుకుంటారు. కానీ రాహుల్ గాంధీ భక్తితో పూజ చేస్తారు తప్ప పబ్లిసిటీ కోరుకోరు. రాముడి ఆదర్శాలను, పాలసీలను ఆచరణలో పెట్టిన కుటుంబం రాహుల్ గాంధీది." అని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి అన్నారు. బీజేపీ రాష్ట్ర నేతల తీరును తప్పుబడుతూ.. అయోధ్యలో దొంగతనాన్ని చిన్న విషయంగా చిత్రీకరించడంపై జగ్గారెడ్డి మండిపడ్డారు. బీజేపీ నేత రాంచందర్ రావు ఇలాంటివి చిన్న చిన్నవి జరుగుతుంటాయని అనడం విడ్డూరంగా ఉందన్నారు. అయోధ్య లాంటి పవిత్ర స్థలంలో దొంగతనం జరగడం జాతీయ పార్టీ నేతకు చిన్న విషయంగా కనిపిస్తోందా అని ప్రశ్నించారు. ఇదే దొంగతనం కేంద్రంలోనో, యూపీలోనో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు జరిగి ఉంటే.. బీజేపీ నేతలు దేశవ్యాప్తంగా ఉద్యమాలు చేసి అల్లకల్లోలం చేసేవారు కాదా అని నిలదీశారు. అధికారం ఉంటే ఒకలా, లేకపోతే ఒకలా ప్రవర్తించడం బీజేపీ నైజమన్నారు. మతం పేరుతో, దేవుడి పేరుతో బీజేపీ పబ్బం గడుపుకుంటోందని.. కానీ కాంగ్రెస్ పార్టీ అన్ని కులాలు, మతాలను కలుపుకుంటూ సమానత్వంతో ముందుకు వెళ్తుందని జగ్గారెడ్డి స్పష్టం చేశారు. స్వాతంత్ర్యానికి పూర్వమే నెహ్రూ గారు రాముడి పాలన ఆదర్శాలను అమలు చేశారన్నారు. అయోధ్యలో జరిగిన భద్రతా లోపానికి, దొంగతనానికి బాధ్యత వహిస్తూ ప్రధాని మోడీ, అమిత్ షా దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఆడబిడ్డగా పార్టీ పెట్టా.. రాష్ట్ర రాజకీయ అజెండా మారుస్తా!

- పేద, మధ్యతరగతి ప్రజలకు ఉచిత విద్య, వైద్యమే మా లక్ష్యం
- కాంగ్రెస్, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు పేదల గురించి ఆలోచించడం లేదు
- సీఎం రేవంత్ రెడ్డిపై 'టీఆర్ఎస్' చీఫ్ కవిత ధ్వజం



**హైదరాబాద్, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** "తెలంగాణలో ప్రస్తుతం ఉన్న రాజకీయ పార్టీల అజెండా మారాల్సిన అవసరముంది. పెద్దవాళ్ల కోసం కాకుండా, పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు మార్చేందుకే నేను ఒక ఆడబిడ్డగా కొత్త పార్టీ పెట్టి జెండా ఎత్తాను" అని తెలంగాణ రక్షణ సేనచీఫ్ కల్వకుంట్ల కవిత స్పష్టం చేశారు. బుధవారం సికింద్రాబాద్‌లోని సీతాఫల్‌మండిలో పార్టీ జెండాను ఆవిష్కరించిన అనంతరం ఆమె మీడియాలో మాట్లాడారు. తెలంగాణ వస్తే అందరి జీవితాలు మారుతాయని భావించామని, కానీ దురదృష్టవశాత్తు అలా జరగలేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదలకు ఉచిత విద్య, వైద్యం అందించడంతో పాటు, యువత స్వయం ఉపాధి కోసం రూ.2 లక్షల నుండి రూ.20 కోట్ల వరకు రుణాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాలనపై కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీలను, కొత్త పెన్షన్లను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని మండిపడ్డారు. విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ధ్వజమెత్తారు. "పేదలకు మంచి చేసేందుకు ఈ ప్రభుత్వం దగ్గర డబ్బులు లేవు కానీ, లక్షల కోట్లతో మూసీ ప్రక్షాళన, మెట్రో అంటూ పెద్దవాళ్ల కోసం రేవంత్ రెడ్డి పనిచేస్తున్నారు" అని ఎద్దేవా చేశారు. ఉద్యమకారులకు ఇళ్ల స్థలాలు ఇస్తామని చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని కవిత ఆరోపించారు. ఈ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేలా గురువారం ఉప్పల్ భగాయత్‌లో పెద్ద ఎత్తున 'భూపోరాటం' నిర్వహిస్తామని, ప్రభుత్వ స్థలాన్ని స్వాధీనం చేసుకుని ఉద్యమకారులకు భూ పంపిణీ చేస్తామని ఆమె సంచలన ప్రకటన చేశారు. అనంతరం మెహదీపట్నంలోని కింగ్స్ ప్యాలెస్‌లో నిర్వహించిన మెగా జాబ్ మేళాకు కవిత ముఖ్య అతిథిగా హాజరయ్యారు. దాదాపు 1500 కంపెనీలతో వేలాది మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్న నిర్వాహకులను ఆమె అభినందించారు. ఈ సందర్భంగా యువతను ఉద్దేశించి మాట్లాడుతూ.. తన తొలి ఉద్యోగ అనుభవాన్ని పంచుకున్నారు. "2001లో నేను అమెరికాలో మొదటి ఉద్యోగం కోసం ఇంటర్వ్యూకు వెళ్లినప్పుడు, నాకు తెలియని విషయాలను తెలియదనే చెప్పాను. కాస్త సమయం ఇస్తే నేర్చుకుంటానని నమ్మకం కలిగించి ఉద్యోగం సాధించాను" అని గుర్తుచేసుకున్నారు. సక్సెస్‌కు షార్ట్‌కట్లు ఉండవని, యువత కేవలం కష్టపడటాన్నినమ్ముకుని, స్కిల్స్ పెంచుకుని ధైర్యంగా ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

# డాక్టర్లకు మున్నూరు కాపు సంఘం సత్కారం



**వేములవాడ, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** జాతీయ డాక్టర్స్ డే పురస్కరించుకుని వేములవాడ పట్టణంలో బుధవారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. పట్టణ మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొయినేని బాలయ్య, పాలక వర్గ సభ్యుల ఆధ్వర్యంలో పట్టణంలోని పలువురు ప్రముఖ వైద్యులను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్నూరు కాపు సంఘం అధ్యక్షులు కొయినేని బాలయ్య మాట్లాడుతూ.. మానవ సేవయే మాధవ సేవగా భావిస్తూ, రాత్రింబవళ్లు ప్రజల ప్రాణాలను కాపాడుతున్న వైద్యుల సేవలు సమాజంలో ఎంతో విలువైనవన్నారు. కరోనా వంటి విపత్కర కాలంలోనూ తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా రోగులకు సేవలందించిన వైద్యులను గౌరవించుకోవడం మన అందరి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం ప్రధాన కార్యదర్శి, కోశాధికారి, ఇతర పాలక వర్గ సభ్యులు, సంఘ పెద్దలు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొని వైద్యులను అభినందించారు.

# అప్పాయిపల్లి పాఠశాలలో ఎంఈఓ ఆకస్మిక తనిఖీ



**లింగాల, వాయిస్ ఆఫ్ వందే భారత్ :** మండల పరిధిలోని అప్పాయిపల్లి ఎంపీయూపీఎస్ ప్రభుత్వ పాఠశాలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి బషీర్ అహ్మద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పునఃప్రారంభమైన నేపథ్యంలో విద్యార్థుల హాజరు శాతం, రికార్డులు, మౌలిక వసతులపై ఆయన క్షేత్రస్థాయి పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి బషీర్ అహ్మద్ ఉపాధ్యాయులనుద్దేశించి మాట్లాడుతూ.. ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ఆ దిశగా అడ్మిషన్ల ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో నిర్దేశించిన లక్ష్యం కంటే కనీసం 5 శాతం అదనంగా విద్యార్థుల నమోదును పెంచేందుకు ప్రతి ఒక్క ఉపాధ్యాయుడు కృషి చేయాలని ఆదేశించారు. పాఠశాలలో అడ్మిషన్లు పొందిన ప్రతీ విద్యార్థి వివరాలను ఎఫ్ఆర్ఎస్ పోర్టల్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలన్నారు. అలాగే ప్రభుత్వం పంపిణీ చేసిన పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్ వివరాలను కూడా ఆన్‌లైన్‌లో ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన.. నిబంధనల ప్రకారం ప్రభుత్వం కేటాయించిన మెనూను ఖచ్చితంగా పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం వడ్డించాలని ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందం, విద్యాశాఖ సిబ్బంది పాల్గొన్నారు.